



## ఇండస్ఇండ్ పరిస్థితి మెరుగ్గానే

### డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
### స్పష్టంచేసిన రిజర్వుబ్యాంక్

ముంబై, మార్చి 15: ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్ఇండ్ బ్యాంక్ లెక్కల్లో వచ్చిన రూ.2,100 కోట్ల తేడాపై రిజర్వు బ్యాంక్ దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉన్నదని మార్కెట్లో గుప్పుమన్న వార్తలపై సెంట్రల్ బ్యాంక్ స్పందించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితికి వచ్చిన ఢోకా ఏమీ లేదని, డిపాజిటర్లు, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చింది. ప్రస్తుతం బ్యాంక్‌లో నెలకొన్న పరిస్థితులను సమీక్షించడానికి, అకౌంటింగ్ తప్పిదాలపై వాస్తవ పరిస్థితులను త్వరగా అంచనావేయడానికి ఇప్పటికే బ్యాంక్ ప్రత్యేకంగా ఆడిట్ బృందాన్ని నియమించినట్లు ఆర్బీఐ పేర్కొంది. ఈ ప్రత్యేక ఆడిట్ బృందం ఈ నెల చివర్లో లేదా వచ్చే నెల తొలి వారంలో తన నివేదికను సమర్పించనున్నదని పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగా బ్యాంక్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బ్యాంక్ ఆర్థిక మూలాలు దృఢంగా ఉన్నాయని, క్యాపిటల్ అడక్వసీ రేషియో 16.46 శాతంగాను, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 70.20 శాతంగా ఉన్నదని పేర్కొంది.

**రంగంలోకి ఐసీఏఐ**

ఇండస్ఇండ్ బ్యాంక్ ఖాతాల్లో నెలకొన్న అవకతవకలపై నిగ్గు తేల్చడానికి చార్టర్డ్ అకౌంటెంట్ సంఘం ఐసీఏఐ రంగంలోకి దిగింది. రూ.2,100 కోట్ల వరకు లెక్కల్లో వ్యత్యాసంపై ఐసీఏఐ ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక రిపోర్టింగ్ బోర్డ్ ఇచ్చిన సమీక్షపై ఐసీఏఐ ప్రత్యేకంగా సమీక్షించి త్వరలో రిజర్వుబ్యాంక్‌కు తన నివేదికను సమర్పించనున్నది. బ్యాంక్‌లో అకౌంటింగ్ స్టాండర్డ్స్, ఆడిటింగ్, కంపెనీల చట్టం-2013 ప్రకారం షెడ్యూల్ 2, 3 పై కూడా ప్రత్యేకంగా చర్చించనున్నది. మరోవైపు, గడిచిన ఫారెక్స్ లావాదేవీలకు సంబంధించి హెడ్జింగ్ ఖర్చుల్ని బ్యాంక్ తక్కువగా అంచనా వేసినట్టు ఓ అంతర్గత సమీక్షలో తేలింది. బ్యాంకులో పాలనాపరమైన లోపాలున్నాయన్న దానిపై కూడా ఐసీఏఐ దృష్టి సారించనున్నది. గత వారం బ్యాంక్ సీఈవో, ఎండీ కత్‌పాలియా పదవీకాలాన్ని మూడేండ్లకు పెంచుతూ ఇండస్ఇండ్ బ్యాంక్ బోర్డు ప్రతిపాదించినా, ఆర్బీఐ మాత్రం ఏడాదికే అనుమతిచ్చింది.

# ఎంఎస్‌ఎంఈలపై ప్రభుత్వం శీతకన్ను

### కాగితాలకే పరిమితమైన నూతన పాలసీ
### ఇతర రాష్ట్రాలతో మార్కెటింగ్ సమస్యలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఉపాధి రంగానికి ఆయువు పట్టైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగం తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అనుకూల విధానాలతో ఎంఎస్‌ఎంఈ రంగం ఎంతగానో వృద్ధి చెందింది. ఇంజినీరింగ్, కెమికల్స్, మెటల్, ఆహార ఉత్పత్తులు రాష్ట్ర అవసరాలను తీర్చడంతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అయ్యేవి. అయితే గత కొంతకాలంగా గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తీవ్ర పోటీ ఏర్పడినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల తక్కువ ధరకే వారు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలను పూర్తిగా విస్మరించడం వల్ల ఆయా రాష్ట్రాల పోటీని తట్టుకునే పరిస్థితి లేకుండా పోయిందని వారు పేర్కొంటున్నారు. ఈ రంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఎంఎస్‌ఎంఈ-2024 పాలసీ కాగితాలకే పరిమితం కావడంతోపాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో చిన్న..చితక సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**గిరాకీ అంతంతే..**

ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తులకు గిరాకీ లేకుండా పోతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ తీవ్రతరం కావడంతో కొనేవాళ్లు కరువయ్యాయని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా ఆహార పదార్థాలు, కెమికల్స్, మెటల్ ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ యంత్రాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, రబ్బర్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, అల్లిక-దుస్తుల ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి ఆహార పదార్థాల నుంచి పోటీ ఎదురవుతుండగా.. మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ప్లాస్టిక్, కెమికల్స్, తమిళనాడు నుంచి యంత్రాలకు పోటీ ఎదురవుతున్నదని చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరకు ఆయా రాష్ట్రాలు మార్కెటింగ్ చేస్తున్నాయని, దీనివల్ల ఉత్పత్తులు అమ్ముకోలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ కూడా రంగంలోకి దిగిందని, ఆయా రాష్ట్ర ఉత్పత్తులను తెలంగాణలో ప్రమోట్ చేయడానికి ఆ రాష్ట్రం పెద్ద ఎత్తున తాయిలాలు ప్రకటిస్తున్నది. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఫార్మా, ఆహార ఉత్పత్తుల పరిశ్రమలను ఆకర్షించేందుకు తరచూ రాష్ట్రంలోని పరిశ్రమ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఓ వైపు రాష్ట్రంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, మరోపక్క ఇతర రాష్ట్రాలు పిలుస్తుండడంతో ఎంఎస్‌ఎంఈలు పక్క రాష్ట్రాలకు వెళ్లే అనివార్య పరిస్థితులు ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు.



## బీఆర్‌ఎస్ హయాంలో ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి..

- ***2,500 ఎకరాల్లో 28 పారిశ్రామికవాడల ఏర్పాటుతోపాటు 12 పారిశ్రామిక వాడల అప్‌గ్రేడేషన్, మరో 6 కొత్త పార్కుల ప్రతిపాదన***
- *దేశంలో ఎక్కడా లేనివిధంగా సుమారు 500 ఎకరాల్లో గ్రీన్ ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు. ఇందులో దాదాపు రూ.1,500 కోట్ల పెట్టుబడులతో 450 పరిశ్రమలు ఏర్పాటుకాగా, వీటిద్వారా 35 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.*
- ***2014 నుంచి సుమారు 20 వేల ఎంఎస్‌ఎంఈలు కొత్తగా నమోదు చేసుకున్నాయి. దీంతో మొత్తం సంఖ్య 26 లక్షలకు చేరుకున్నాయి.***
- *ప్రస్తుతం రాష్ట్రంలో ఈ చిన్న-చితక సంస్థలు మొత్తంగా రూ.31 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి.*
- ***ఈ విభాగంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య దాదాపు 40 లక్షలు***
- *2014-2023 మధ్యకాలంలో ఎంఎస్‌ఎంఈల వార్షిక వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతానికి చేరుకున్నది.*

## రికార్డుస్థాయిలో ఒప్పందాలు

### ఫిబ్రవరిలో 7.2 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ, మార్చి 15: దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఒప్పందాలు, విలీనాలు జరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో కార్పొరేట్ సంస్థలు భారీ స్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. గత నెలలో 226 విలీనాలు-కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 7.2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయని గ్రాంట్ థార్టన్ భారత్ పేరుతో విడుదల చేసిన నివేదికలో డీల్‌ట్రాకర్ వెల్లడించింది. ఒప్పందాల పరంగా చూస్తే 67 శాతం అధికమవగా, విలువ పరంగా చూస్తే 5.4 రెట్లు పెరిగాయి. వీటిలో 85 విలీనాలు అండ్ కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 4.8 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. ఒప్పందాల్లో జెన్ టెక్నాలజీ, నిట్కో లిమిటెడ్‌లు నాలుగు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతోపాటు ఓఎన్‌జీసీ-ఎన్‌టీపీసీ గ్రీన్ 2.3 బిలియన్ డాలర్లతో అయాన రెన్యూవబుల్ పవర్‌ను కొనుగోలు చేశాయి. అలాగే ప్రణా గ్రూపు 755 మిలియన్ డాలర్లతో ఒవెన్స్ కార్నింగ్స్ గ్లాస్‌ను కొనుగోలు చేసింది. ప్రైవేట్ ఈక్విటీ ఒప్పందాలు 141 జరగగా, వీటి విలువ 2.4 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నది.

## షియోమీ 15 సిరీస్ ఫోన్లు

**ప్రారంభ ధర రూ.64,999**

న్యూఢిల్లీ, మార్చి 15: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త సిరీస్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 15 సిరీస్‌లో భాగంగా విడుదల చేయనున్న ఈ ఫోన్లు అడ్వాన్స్‌డ్ కెమెరా స్మార్ట్‌ఫోన్లతో తీర్చిదిద్దింది. వీటిలో షియోమీ 15 ధర రూ.64,999గా నిర్ణయించిన సంస్థ.. షియోమీ 15 అల్ట్రా మాడల్ ధర రూ.1,09,999కి విక్రయిస్తున్నది. ఈ రెండు ఫోన్లు అమెజాన్‌లో వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది. 6.36 అంగుళాల క్రిస్టల్‌రేస్ డైనమిక్ 1-120 అమోలెడ్ టచ్‌స్క్రీన్‌తో తయారు చేసిన ఈ ఫోన్‌లో 14 ఎంఎం నుంచి 120 ఎంఎం ఫోకల్ లెంథ్‌తో మూడు కెమెరాలు, 50 మెగాపిక్సెల్ లైకాకెమెరా, 5240 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 19 నుంచి ముందస్తు బుకింగ్‌లు ఆరంభిస్తున్నట్లు ప్రకటించింది.

## కొనసాగుతున్న ఎఫ్‌ఐఐల అమ్మకాలు

***ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.64 లక్షల కోట్లు వెనక్కి***



న్యూఢిల్లీ, మార్చి 15: దేశీయ ఈక్విటీ మార్కెట్లపై విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులలో ఆందోళనలో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీగా తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.64 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, వాణిజ్య యుద్ధాలు మరింత తీవ్రతరం కావడం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. మరోసారి అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నట్లు వచ్చిన వార్తలతో ఎఫ్‌ఐఐలు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించారు. దీనికి తోడు ఆటోమొబైల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం కూడా ఎఫ్‌ఐఐలు వెనక్కి తీసుకోవడానికి ప్రధాన కారణమని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. బ్యాంకింగ్ రంగ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని, దీంతోపాటు రియల్టీ, ఆటో, మెటల్ సూచీలు కూడా పతనం చెందడం వారి ఆందోళనను తీవ్రతరం చేసింది.

**ఆదుకున్న డీఐఐలు**

ఒకవైపు ఎఫ్‌ఐఐలు భారీ స్థాయిలో నిధులను తరలించుకుపోతుంటే మరోవైపు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈక్విటీల్లోకి రూ.1.77 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. కొత్తగా ఈక్విటీ మార్కెట్లోకి పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య పెరగడం కూడా ఇందుకు పరోక్షంగా కారణమయ్యాయి.

**తగ్గిన పసిడి రిజర్వులు**

గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు ఎట్టకేలకు పెరిగాయి. ఈ నెల7తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 15.26 బిలియన్ డాలర్లు ఎగబాకి 653.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత రెండేండ్లలో ఒకేవారంలో ఇంతలా పెరగడం ఇదే తొలిసారి. అంతక్రితం వారంలో రిజర్వులు 1.781 బిలియన్ డాలర్లు కరిగిపోయి 638.698 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 13.993 బిలియన్ డాలర్లు ఎగబాకి 557.282 బిలియన్ డాలర్లకు చేరుకోగడం ఇందుకు కారణం. కానీ, బంగారం నిల్వలు మాత్రం కరిగిపోయాయి. గతవారంలో 1.053 బిలియన్ డాలర్లు తగ్గి 74.325 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది.

## ఈ-కామర్స్ దిగ్గజాలకు షాక్

న్యూఢిల్లీ, మార్చి 15: ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలకు బీఐఎస్ షాకిచ్చింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు చెందిన గిడ్డంగులపై దాడులు చేసి..వేలాది సంఖ్యలో ధృవీకరించబడని వినియోదారుల ఉత్పత్తులను సీజ్ చేసినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నెల 7న లక్నోలోని అమెజాన్ గిడ్డంగుల్లో తనిఖీ చేసి 215 టాయ్స్, 24 హ్యాండ్ బ్లెండర్ల ఉత్పత్తులను సీజ్ చేసింది. అలాగే ఢిల్లీలో అమెజాన్‌కు ఉన్న గిడ్డంగిలో 58 అల్యూమినియం రేకులు, 34 మెటాలిక్స్ వాటర్ బాటిళ్లు, 25 ఆటబొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పీవీసీ కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్లు సీల్ చేసింది. వీటికి సంబంధించి ఎలాంటి కాగితాలు లేవని బీఐఎస్ గుర్తించింది. అలాగే ఫ్లిప్‌కార్ట్ గిడ్డంగిలో 534 స్టెయిన్‌లెస్ స్టీల్ వాక్యూమ్, 134 ఆటబొమ్మలు, 41 స్పీకర్లు సీల్ చేసినట్లు బీఐఎస్ వర్గాలు వెల్లడించాయి.




మంటల్లో చిక్కుకున్న ఆనంద్‌కుమార్



చికిత్స పొందుతున్న ప్రశాంత్

## వ్యాపారి కుటుంబం ఆత్మహత్యాయత్నం

### బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న వైనం

### వరంగల్ చౌరస్తాలో ఘటన

వరంగల్ చౌరస్తా, మార్చి15: బ్యాంకు అధికారులు అక్రమాలకు పాల్పడడమేగాక తమ ఆస్థిని మరొకరికి కట్టబెడుతున్నారని ఆరోపిస్తూ పెట్రోల్ పోసుకొని వ్యాపారి కుటుంబసభ్యులు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం వరంగల్ చౌరస్తాలో చోటుచేసుకుంది. క్షతగాత్రుల కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన చెల్లుపూరు హేమ్‌కుమార్, అనంద్‌కుమార్ సోదరులు. వీరు వ్యాపార నిమిత్తం కాజీపేటలోని యూనియన్ బ్యాంక్‌లో 2017లో సుమారు రూ.కోటి 20 లక్షలు తీసుకున్నారు. తిరిగి చెల్లింపు విషయంలో ఆలస్యం కావడం, లావాదేవీలు నిలిచిపోవడం తో బ్యాంకు అధికారులు తనఖా ఉన్న ఇంటిని నిబంధనలను అనుసరించి మరో వ్యక్తికి అమ్మకం జరిపారు. విక్రయించిన ఆస్థిని కొనుగోలుదారుడికి అప్పగించే క్రమంలో కొంత కాలంగా రుణగ్రహీతలు సహకరించకపోవడంతో కోర్టు అధికారులు పోలీస్ బందోబస్తుతో తనఖా ఉన్న భవనం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న హేమ్‌కుమార్, ఆనంద్‌కుమార్ కుటుంబసభ్యులతో అక్కడికి చేరుకొని తమ ఆస్థిని తమకు కాకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ వరంగల్ చౌరస్తాలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో చెల్లుపూరు ఆనంద్‌కుమార్ (60)తో పాటు తన అల్లుడు ప్రశాంత్ (32), హేమ్‌కుమార్ కోడలు తేజస్వి(35)కి మంటలు అంటుకొని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు మంటలను ఆర్పి, బాధితులను చికిత్స నిమిత్తం వెంకటరమణ జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు జరిగిన ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టామని, సాక్ష్యాదారాలను సేకరిస్తున్నామని వారు తెలిపారు. ఈ విషయంపై ఇరువర్గాల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## సీకేఎంలో ఓపీ సేవలు ప్రారంభం



ఓపీ వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వరంగల్ చౌరస్తా, మార్చి15: ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ప్రసూతి, గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్న సీకేఎం హాస్పిటల్‌లో సంతాన భాగ్యం లేని దంపతులకు మెరుగైన ఓపీ సేవలు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం వైద్యు లు ఓపీ సేవలను ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సేవలు కొనసాగుతాయని సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ మురళి, డాక్టర్ సత్యాజిత్ పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల నిరసన

వరంగల్, మార్చి 15: ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం నుంచి బల్దియా, కుడా లైసెన్స్‌డ్ సర్వేయర్లు బయటకొచ్చారు. శనివారం డీసీసీబీ అడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ సత్యశారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే సర్వేయర్లను ఎందుకు పిలిచారు, ఎల్‌ఆర్‌ఎస్‌లో వారి పాత్ర ఏముంటుందని కలెక్టర్ పేర్కొనడంతో బయటకొచ్చినట్లు లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి పాము సత్యనారాయణ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో సర్వేయర్లు అవసరం లేనప్పుడు కుడా, బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు తమను ఎందుకు పిలిచారని ఆయన ప్రశ్నించారు. అనంతరం ఆడిటోరియం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

## మొక్కలు పెంచేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలి

**మేయర్ గుండు సుధారాణి**



బాలసముద్రంలోని నర్సరీని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్, మార్చి 15 : మొక్కలు పెంచేందుకు వీలుగా షెడ్లు ఏర్పాటు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. హనుమకొండ బాలసముద్రంలోని నర్సరీని శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి నుంచే వన మహోత్సవానికి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. నర్సరీల్లో పూలు, పండ్లు, ఔషద మొక్కలు పెంచాలన్నారు. నర్సరీ నుంచి బయటకు వెళ్లే ప్రతి మొక్క వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట హార్టికల్చర్ అధికారులు రమేశ్, లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, ప్రియాంక, హనుహ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

**సమగ్రంగా బడ్జెట్ రూపొందించాలి**

సమగ్ర సమాచారంతో బల్దియా బడ్జెట్ రూపొందించాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి అన్ని విభాగాల అధికారులతో 2025-26 బడ్జెట్ రూపకల్పనపై సమీక్షించారు. బడ్జెట్‌కు సంబంధించిన మార్పులు, చేర్పులుంటే కమిషనర్‌తో చర్చించాలన్నారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, జేవో సరిత పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి చేయూతనందించాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**



సమావేశంలోమాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 15 : పరకాల నియోజకవర్గ యువత, మహిళలు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా అధికారులు తోడ్పడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పరకాల నియోజకవర్గం పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ట్రైనింగ్ సెంటర్, పాల డెయిరీల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహణపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అంశాలను డీఆర్‌డీవో మేన శ్రీను వివరించారు. అనంతరం రేవూరి మాట్లాడుతూ మహిళలు, యువత సంక్షేమానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో ఎన్నారైలు భాగస్వామ్యమయ్యేలా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. రైతులు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే నెల 4న దామెర మండలానికి మంత్రి శ్రీధర్‌బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తం గా ఇప్పటి వరకూ దాదాపు 3,500 మంది ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం నమోదు చేసుకున్నారన్నారు. ఏప్రిల్ 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఇందుకు 50 వరకు సంస్థలు, కంపెనీలు వస్తున్నాయని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలన్నారు.

## సుగంధ ద్రవ్యాల పంటలు సాగు చేయాలి

కరీమాబాద్, మార్చి 15: అధిక ఆదాయ పంటలైన సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారి సంగీత కోరారు. మామునూరులోని కృషి విజ్ఞానకేంద్రంలో సుగంధ ద్రవ్యాల సంస్థ వరంగల్ సౌజన్యంతో తెలంగాణకు అనువైన సుగంధ ద్రవ్యాల సాగుపై ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో శనివారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి సంగీత మాట్లాడుతూ శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశా రు. కార్యక్రమంలో సుగంధ ద్రవ్యాల సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజీష్ణ పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

## నవ్య.. నయా లీలలు

**పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న 'కిలేడీ' అరాచకాలు**

సుబేదారి, మార్చి 15 : అక్రమంగా డబ్బులు సంపాదించడానికి అమాయక బాలికలను ట్రాప్ చేసి, మత్తుకు అలవాటు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 'నవ్య' నయా లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కాలనీలో నివసిస్తున్న ఎనిమిదో తరగతి విద్యార్థినిని ట్రాప్ చేయడంతో ఆ కిలేడీ భాగోతం బయటపడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వరంగల్ నగరం కాశీబుగ్గకు చెందిన యువతి దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన పిన్ని వద్ద ఉండేది. ఇటీవల మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి మకాం మార్చింది. ఈ క్రమంలో శివనగర్‌కు చెందిన యువకుడితో ప్రేమలో పడింది. ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడి, అక్రమంగా డబ్బు సంపాదనకు తెరలేపారు. మరికొందరు యువకులతో కలిసి ఆ యువతి డ్యాన్స్, మోడ్రన్‌గా రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టేది. ఈ పోస్టుల ద్వారా మిల్స్‌కాలనీ ఏరియాకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినితో స్నేహం ఏర్పడింది. ఆ బాలికను ట్రాప్ చేసి, కొద్ది రోజులుగా గంజాయి సిగరెట్లకు అలవాటు చేసింది. ఇదే సమయంలో వారం క్రితం కిలాడీ ఆ బాలికను దామెర మండలంలో పిన్ని ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

**బాలిక తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి..**

వారం క్రితం బాలిక ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులకు కొద్ది రోజులుగా కిలాడీ యువతితో బాలిక కనిపిస్తున్నట్లు స్థానికుల నుంచి సమాచారం రావడంతో మూడు రోజుల క్రితం ఆ యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. బాలికను కూడా విచారించడంతో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. ఆ కిలాడీ కొంత కాలంగా గంజాయి, సిగరెట్ స్మోకింగ్‌కు అలవాటు పడి, అక్రమంగా డబ్బులు సంపాదించడానికి లవర్, మరికొంత మంది ముఠాతో కలిసి పాఠశాలలకు వెళ్లే బాలికలను ట్రాప్ చేసి, పిన్ని ఇంటి వద్ద అసాంఘిక కార్యకలాపాలకు ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఇంతలోనే బాలిక కిడ్నాప్ కేసు విచారణతో కిలేడీ భాగోతాలు వెలుగులోకి వచ్చాయి. సదరు యువతితో పాటు ఆమె పిన్ని, ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో కీలక వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా, నిందితులను మరో రెండు రోజుల్లో పోలీసులు అరెస్టు చూపించి, పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ


## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు అందేలా కృషి

**ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ**

హనుమకొండ చౌరస్తా, మార్చి 15 : రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు కచ్చితంగా అక్రిడిటేషన్ కార్డులు అందేలా తమ సంఘం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ భరోసా ఇచ్చారు. శనివారం బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విరాహత్‌అలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల విషయంలో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం రాంచందర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు తోట సుధాకర్, మట్టా దుర్గాప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

**'గ్రేటర్' కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**



పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్, మార్చి 15: నగరంలో పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే సూచించారు. వరంగల్ 57వ డివిజన్ ఎన్‌జీవోస్ కాలనీలో శనివారం ఆమె క్షేత్రస్థాయి లో పారిశుధ్య పను ల నిర్వహణను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మికుల పనితీరును నిత్యం పర్యవేక్షించాలన్నారు. రోడ్ల శుభ్రతతోపాటు డ్రైనేజీలు, గ్యాంగ్ వర్క్‌లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్లు పాల్గొన్నారు. అలాగే, కమిషనర్ బల్దియా కార్యాలయంలో పన్ను వసూళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పన్ను వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 రోజులు మాత్రమే సమయం ఉందని గుర్తుచేశారు.

## చర్లపల్లి స్టేషన్ మీదుగా పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట, మార్చి 15 : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునః నిర్మాణ పనుల కారణంగా కాజీపేట నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి మౌలాలి బైపాస్, సనత్‌నగర్, అమ్ముగడ్డ బైపాస్, లింగంపల్లి, కామారెడ్డి రైల్వే స్టేషన్ల మీదుగా దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఏప్రిల్ 26, 27 తేదీల్లో విశాఖపట్నం- హజరత్ నాందేడ్- విశాఖపట్నం 20811/20812 రైలు, 24, 25లో విశాఖపట్నం- సాయినగర్ షిర్డీ- విశాఖపట్నం 18503/18504 సాయినగర్ షిర్డీ వీక్లీ ఎక్స్‌ప్రెస్, 25, 26 తేదీల్లో నర్సాపూర్-నాగర్‌సోల్- నర్సాపూర్ 12787/12788 రైలు, మే 9, 12 తేదీల్లో వాస్కోడిగామ-జసిడిదీస్- వాస్కోడిగామ 17321/ 17322 రైలు, ఏప్రిల్ 22, 23లో మచిలీపట్నం- సాయినగర్ షిర్డీ- మచిలీపట్నం 17208/17207 వీక్లీ రైలు, 23, 24లో కాకినాడ పోర్టు- సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు 17206/17205 వీక్లీ రైలు, ఏప్రిల్ 22, 24 తేదీల్లో విశాఖపట్నం- ఎల్‌టీటీ- విశాఖపట్నం 18519/18520 ఎల్‌టీటీ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా కాకుండా చర్లపల్లి రైల్వే స్టేషన్ మీదుగా దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.